క్లుప్తంగా

సీఆర్ఎస్‌లో ఉచిత ధ్యాన శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సీఆర్ఎస్ కార్మికులు, సొసైటీ సభ్యులు

రేణిగుంట: క్యారేజ్ రిపేర్ షాప్(సీఆర్ఎస్) రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఆర్ఎస్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో తొమ్మిది రోజులపాటు నిర్వహించే దేవీ నవరాత్రుల సందర్భంగా ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రతిరోజు గంట పాటు ధ్యానం చేయడంతో మనకు కొత్త శక్తి, ఉత్తేజం వస్తుందన్నారు. పిరమిడ్ శక్తిని వినియోగించుకుని షుగర్, బీపీ తదితర మొండి వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. ధ్యానం ప్రతి ఒకరి జీవితంలో భాగమై ఉండాలని కోరారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ సభ్యులు, సోమేశ్వరమ్మ, శ్రీనివాసులు, నాగరాజు, బాల, ధనుంజయ పాల్గొన్నారు.

శ్మశానంలో చేతిపంపు ఏర్పాటు



చేతిపంపును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తంగెళ్లపురంలోని శ్మశానంలో చేతిపంపును గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి శ్మశానం దూరంగా ఉండడంతో మృతదేహాల ఖననానికి, కర్మక్రియలకు నీటికోసం గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో బోరువేసి, చేతిపంపును అమర్చామన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీ రోడ్డులో ఉన్న అంకాళమ్మ ఆలయం వద్ద బుధవారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రి బాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్ రెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

2కే రన్ విజయవంతం



2కే రన్ లో పాల్గొన్న విద్యార్థులు

రేణిగుంట: రేణిగుంట డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం 2కే రన్‌ను విమానాశ్రయ మార్గంలో ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బషీర్ తపస్య స్కూల్ అధినేత విక్రమ్ శాలీ, డైరెక్టర్ కె.అనూష ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పురప్రజలు 2కే రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

సత్యవేడు: పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో విజయదశమి సందర్భంగా దేవతా మూర్తుల బొమ్మలు కొలువు ఏర్పాటు చేశారు. బుధవారం ఆలయ నిర్వాహకులు రవికుమార్ దేవర్ ఆధ్వర్యంలో బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, శివపార్వతులు, శ్రీరాముడు, శ్రీవేంకటేశ్వరస్వామి, గణపతి, సుబ్రమణ్యస్వామి, నవ దుర్గామాతలు, అయ్యప్ప, మత్స్యావతారంలో మహావిష్ణువు, హనుమంతుడు తదితర దేవతా మూర్తుల ప్రతిమలతో కొలువు ఏర్పాటు చేశారు. దేవతా మూర్తులు ప్రతిమలు కనువిందు చేశాయి.

యోగాతో ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: క్రమం తప్పకుండా యోగా చేయడంతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగ గురువు సురేష్‌నాయుడు తెలిపారు. బుధవారం నేచురోపతిడేని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్‌వీఆర్ విద్యా సంస్థల్లో ఆయన యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాలను తగ్గించటానికి రోగులు కొన్ని యోగాసనాల్ని నేర్చుకుని, ప్రతి రోజు క్రమం తప్పకుండా వేస్తే రోగం నయం అవుతుందని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవటానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



సత్యవేడు-చిన్న పాండూరు ప్రధాన రోడ్డుకు తూర్పు భాగంలో శోత్రియ భూములను దున్నేసిన ఆక్రమణదారులు

భూతాళ మాంత్రికులు



చిన్నపాండూరు ప్రధాన రోడ్డుకు పడమటి భాగంలో శోత్రియ భూములను దున్నేసిన ఆక్రమణదారులు

ఖాళీ భూమి కనిపిస్తే చాలు..అది ఎలాంటిదైనా తమ ఖాతాలో వేసుకోవడానికి కొందరు బరితెగిస్తారు. ఇళ్ల స్థలాలు పోయె.. చెరువులు పోయె..కాలువలు, దొరువుల పోయె.. చివరకు శోత్రియ భూములను అక్రమార్కులు వదలడం లేదు. చిన్నపాండూరులో ఇప్పుడు ఇలాంటి భూమిపైనే కొందరు కన్నేసి.. దున్నేశారు. అయినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు ఉన్నారు.

- రాత్రికి రాత్రే దుక్కి దున్ని ఆక్రమణ
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీ భూ ఆక్రమణలకు అడ్డాగా మారింది. ఈ పరిసర ప్రాంతాల్లో విరివిగా పరిశ్రమలు రావడంతో అక్కడి భూములకు ఎక్కడలేని గిరాకీ ఏర్పడింది. ప్రభుత్వ డీకేటీ భూమి ఎకరం రూ.కోట్లు పలుకుతోంది. భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు రావడంతో అక్రమార్కుల కళ్లు ఆ భూములపై పడ్డాయి. ఇన్నాళ్లు వీకేఆర్‌పై కాలనీలో గిరిజనులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను దర్జాగా కొనుగోళ్ల పేరుతో ఆక్రమించుకున్నారు. తాజాగా సమీపంలోని పాదిరికుప్పం రెవెన్యూలోని 1,056 ఎకరాల శోత్రియ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. వారం క్రితం అర్ధరాత్రి ఆ భూముల్లో ఓ వైపు పొలం దున్నకం పనులకు పూనుకుని ఆక్రమణకు పావులు కదుపుతున్నారు. దున్నిన పొలం సత్యవేడు-చిన్న పాండూరు ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకుని ఉండడంతో ఆ భూములను కబ్జా చేసేందుకు తెర వెనుక కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే కొంత మేరకు షికారీలు ఆక్రమించుకుని ఆ భూమి తమ పూర్వీకులకు చెందినదిగా బుకాయిస్తూ గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాగే కొనసాగితే శోత్రియ భూములు పూర్తిగా అక్రమార్కుల పాలయ్యే ప్రమాదం ఉంటోంది.

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

శోత్రియ భూములు పెద్దఎత్తున ఆక్రమణలు జరుగుతున్నా తమకేమీపట్టనట్లు రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రాంతంగా ఉన్న శోత్రియ భూములు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఓవైపు దుక్కి దున్నకాలు, మరోవైపు గ్రావెల్ అక్రమ రవాణా, షికారీల గుడిసెలు.. ఇలా ఆక్రమించినోడిదే భూమి అన్న చందాన అక్రమార్కుల పాలవుతున్నాయి. ఎంతో విలువైన భూములు అన్యాక్రాంతమవుతుంటే నియంత్రించాల్సిన రెవెన్యూ శాఖ చోద్యం చూస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన రోడ్డు కిరువైపులా ఆక్రమణలు

చిన్న పాండూరు-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని వీకేఆర్‌పై కాలనీ సమీపంలో రోడ్డుకు తూర్పు, పడమర రెండు వైపులా సుమారు 100 ఎకరాలకు పైగా కొన్ని రోజులుగా దుక్కి దున్నకాలు చేపట్టిన ఆక్రమిత భూమిలో పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఎకరా రూ. 10కోట్లకు పైగా విలువ కలిగిన ఈ ప్రాంతంలో ఇంత పెద్దఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమణ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

> **విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> శోత్రియ భూముల్లో అక్రమంగా దున్నకాల విషయం ఆలస్యంగా మా దృష్టికి వచ్చింది. వివిధ కేసులకు సంబంధించి హైకోర్టుకు హాజరయ్యాను. వచ్చిన వెంటనే శోత్రియ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ జరుగుతున్న ఆక్రమణలు, ఇతర కార్యకలాపాలపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం

గ్రామసభలో అభివృద్ధికి శ్రీకారం



పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేస్తున్న ప్రజాప్రతినిధులు

నాగలాపురం: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పచ్ చిన్నదొరై సుధ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ పర్యవేక్షణలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త పనులను గుర్తించడం కోసం, గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కావాల్సిన పనులను గుర్తించి గ్రామ సభలలో తీర్మానం చేస్తారన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు గాంధీ జయంతిని పురస్కరించుకుని శాలువ కప్పి సన్మానం చేశారు. ఉపసర్పంచ్ సునీత, చిరంజీవి, నేతలు కులశేఖర్ రెడ్డి, ధనరాజ్, సునీల్ కుమార్, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటిద్దాం



రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు, చెత్త తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు, ఉపాధి కూలీలు



మొక్క నాటుతున్న ఈఓ లత

సత్యవేడు: మండలంలోని సత్యవేడులో బుధవారం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, విడోస్ కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై ఎంపీడీ చంద్రశేఖర్, సర్పంచ్ పి.మంజుల ప్రజల కు అవగాహన కల్పించారు. గ్రామంలోని వీధులకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు,ముళ్లపొదలను తొలిగించి, బ్లీచింగ్ చల్లారు. వైఎస్సార్ సీపీ నేత రమేష్, వార్డు సభ్యులు మదన్, కోనయ్య, గౌరి, ఈఓపీఆర్డీ మునిరవికుమార్ పాల్గొన్నారు.

పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో..

నాగలాపురం: మండల కేంద్రంలో సురుటుపల్లె లోని పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సూచనలు మేరకు బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఈఓ లత ఆధ్వర్యంలో ఆలయంలోని అర్చకులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆలయ అర్చకులు, సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని స్వచ్ఛత్ రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మావుడూరు మోహన్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం వరదయ్యపాళెం పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, అధికారులు, స్థానికులతో కలసి స్థానిక పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఈఓ బసిరెడ్డి, వార్డు సభ్యులు సిద్ధలయ్య, మునిభూషణమ్మ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి బాధ్యత

ఏర్పేడు: గ్రామాభివృద్ధి అందరి బాధ్యతని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీ పుత్తూరులో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా రోడ్లపై చెత్తచెదారాలను శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి లోకముని, దొరస్వామి, వీరరాఘవులు పాల్గొన్నారు.



రోడ్డు శుభ్రం చేస్తున్న సర్పంచ్ మోహనప్రియ



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, ప్రజలు

ఆక్రమణలు తొలగించాలి

ఏర్పేడు: వరవ కాలువ ఆక్రమణలు తొలగించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎస్ శివయ్య అన్నారు. బుధవారం ఏర్పేడు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఏర్పేడు చెరువు కలుజు నుంచి పొలాలకు సాగు నీరందించే వరవ కాలువ ఉందన్నారు. కాలువను స్థానికులు, స్థానికేతరులు పూడ్చివేసి పక్కా భవనాలు నిర్మించుకున్నారని చెప్పారు. దీంతో వర్షాకాలంలో వరవ కాలువ నుంచి నీటి ప్రవాహం కమ్మ వీధి, యాదవ వీధి, అశోక్‌నగర్‌పై ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులుపడుతున్నారని చెప్పారు. ఈ సమస్యపై గ్రామస్తులు ఫిర్యాదు చేసినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని పేర్కొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయాధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 848 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టికెట్లు తీసుకుని 1,809 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు పూజా టికెట్ల ద్వారా 2,156 మంది, రూ.750 టికెట్లతో 902 మంది, రూ.1,500 టికెట్లు కొని 233 మంది, రూ.2,500 టికెట్లతో 208 మంది, రూ.5 వేలు టికెట్ల ద్వారా 88 మంది పూజలు చేసుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,758 విక్రయి అయినట్లు ఆలయాధికారులు తెలిపారు.

ఆగమోక్తంగా అమావాస్య ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అమావాస్య ఉత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తరువాత చప్పరాలపై కొలువుదీర్చి ఊరేగించారు.

వరదయ్యపాళెం ట్రాన్స్‌కో ఏఈగా విజయ్ వెంకటేష్



వరదయ్యపాళెం: ట్రాన్స్‌కో మండల ఏఈగా విజయ్ వెంకటేష్ బుధవారం వరదయ్యపాళెం విద్యుత్‌శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన సత్యవేడు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న శివప్రసాద్ శ్రీకాళహస్తి టౌన్‌కు బదిలీ అయ్యారు. నూతన ఏఈ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కనకాచలం ముస్తాబు



శ్రీకాళహస్తి: పట్టణంలోని కనకాచలం పై ఉన్న కనకదుర్గమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.



గాంధీజీ మార్గం అనుసరణీయం

- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి





శ్రీకాళహస్తిలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేతలు

శ్రీకాళహస్తి: మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బాపూజీ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని గాలిగోపురం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా సాయం చేస్తే మరచిపోయి, ఇతరుల సాయం పొందితే మాత్రం జీవితకాలం పెట్టు కోవాలన్న గాంధీజీ మాట ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. అహింస పోరాటంతో దేశ స్వాతంత్ర్యం సాధించారన్నారు. ఆయన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సా ర్ సీపీ పట్టణాధ్యక్షుడు పగడాల రాజు, నాయకులు ఉత్తరాజి శరవణకుమార్, కంఠ ఉదయ్ కుమార్, మున్నా, జయశ్యామ్, పులి రామచంద్ర, గణేష్, పెరుమాళ్, ధన, జీవీకే రెడ్డి, యానాదశయ్య, మణి, శ్రీవారి సురేష్, ఆటో సురేష్, పత్తి మణి, వల్లం గోపి, ఫజల్, శ్రీను, మల్లి, సాయి, నారాయణ,రవి, సుందరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో వాడవాడాలా బుధవారం ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలను నిర్వహించారు. అందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి నియోజకవరగలోని టీఎంవీ కండ్రిగలో ఏపీ బీసీసంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మబ్బురామిరెడ్డి, శీను, మోహన్‌రెడ్డి, రమేష్, వీరయ్య, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో గాంధీ జయంతివేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటముని, గోపి, మోహన్, నాగూరయ్య, శివయ్య, బాణమ్మ, వాణెమ్మ, చిరంజీవి, ఆర్ముగం, భాస్కర్ పాల్గొన్నారు.

వాడ వాడలా గాంధీ జయంతి

సత్యవేడు: మండలంలో వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. సత్యవేడు మూడు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహానికి సర్పంచ్ పి. మంజుల పూలమాల వేసి, నివాళులర్పించారు. హ్యూమన్ ఎయిడెడ్ ఫర్ పూర్ పీపుల్ మోజన సొసైటీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, గోపి, చెంచుకృష్ణ, పల్లవి, పద్మ, గీత పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు గాంధీజీ పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టవర్ క్లాక్ కూడలి వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి గజమాల వేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదొరై సుధా, ఉప సర్పంచ్ సునీత, నాయకులు ఉదయ్ కుమార్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, ధనరాజ్, పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మహాత్మాగాంధీ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఏర్పేడు, పాపానాయుడుపేట రాస్ వృద్ధాశ్రమం, ఇసుకతాగేలి, మర్రిమంద, ఎండీపుత్తూరు, పాపానాయుడుపేట తదితర గ్రామాల్లో మహాత్మా గాంధీ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ జరిగింది.

బుచ్చినాయుడు కండ్రికలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని సచివాలయం వద్ద బుధవారం మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు పూలమాలవేసి, నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లకు శాలువలు కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాపూజీ త్యాగాలు స్ఫూర్తిదాయకం

రేణిగుంట: మహాత్మ గాంధీజీ దేశం కోసం చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకమని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ రేణిగుంట బ్రాంచి అధ్యక్షుడు హసన్ సాహెబ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఉన్న గాంధీజీ, కస్తూర్బా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రాంచి సెక్రటరీ జి. జయంత్ కుమార్, రేణిగుంట సర్పంచ్ నగేషం, వెంకటేశ్వర్లు, గురవయ్య, జ్ఞానశేఖర్, రవి, జయశీలన్,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహానికి ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు పూలమాలలు వేసి స్వీట్లు పంచిపెట్టారు.



పిచ్చాటూరులో గాంధీకి నివాళి

పిచ్చాటూరులో..

నాగలాపురం: అహింసా మార్గంలో నడిచి అందరికి ఆదర్శంగా నిలిచిన జాతిపిత మహాత్మాగాంధీ తత్వాన్ని ఆచరిద్దామని రిటైర్డ్ హెచ్ఎం నాగయ్య పిలుపునిచ్చారు. 1993 బ్యాచ్ పదో తరగతి పూర్వం విద్యార్థులు బుధవారం గాంధీ జయంతిని పిచ్చాటూరు గాంధీ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీకి నివాళులర్పించారు. చాక్లెట్లు పంచి, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం రామలింగం, విశ్రాంత ఉపాధ్యాయులు జయరామ్ శ్రీనివాసన్, హిందీ పండిట్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలల్లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యంపై ర్యాలీలు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా సంపద కేంద్రాన్ని పునః ప్రారంభించారు. పంచాయతీ కార్మికులకు దుస్తులను, యూనిఫామ్ అందజేసి, వారిని సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుమన్ తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పాలమంగళం ఉత్తరపుకండ్రిగ వీధుల్లో పిల్లలు, సచివాలయ సిబ్బంది ర్యాలీని నిర్వహించారు.



సత్యవేడు: గాంధీకి నివాళులర్పిస్తున్న సర్పంచ్ మంజుల



నాగలాపురం: గాంధీ పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఏర్పేడు: గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది, పలువురు నాయకులు



బుచ్చినాయుడుకండ్రిగలో గ్రీన్ అంబాసిడర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ



పాలమంగళం ఉత్తరంలో ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు